క్లుప్తంగా

ఫ్లోరోసిస్ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న అరుణజ్యోతి

లావేరు: ఫ్లోరోసిస్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్‌టెంట్ ఎల్.అరుణజ్యోతి అన్నారు. బుడుమూరు హైస్కూల్‌లో సోమవారం హెల్త్ ఎడ్యుకేషన్ ద్వారా ఫ్లోరసిస్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాధి ఎలా వస్తోంది, లక్షణాలు ఏమిటి, నివారణ చర్యలు, ఆహారపు అలవాట్లు గురించి వివరించారు. పౌష్టికాహారం తీసుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఎటువంటి అనారోగ్య సమస్యలు వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏలు ఆర్.ఎల్.ఎస్.శ్యామ్‌సుందర్, వరహాలు, ఎంఎల్‌హెచ్‌పీ బి.యమున, ఫీల్డ్ అసిస్టెంట్ పి.ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

బాడీ బిల్డర్స్ అసోసియేషన్‌లో సిక్కోలుకు స్థానం



అసోసియేట్ ప్రతినిధులతో విజయ్‌కుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డర్స్ అసోసియేషన్‌లో శ్రీకాకుళం జిల్లాకు స్థానం దక్కింది. విశాఖలోని రామ్‌సాయి మజిల్ జిమ్‌లో అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడు కొరిబిల్లి సోమినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కార్యదర్శిగా రాము, జిల్లాకు చెందిన వి.వి జయ్‌కుమార్ అసోసియేట్ సెక్రటరీగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫిబ్రవరి నుంచి నూతన కార్యవర్గం అమల్లోకి వస్తోందని అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

సాయిబాబాకు హోమ పూజలు

జి.సిగడాం: ఆనందపురం గ్రామంలోని వంద అడుగుల వెంకటి సాయికోటి మహాస్థూపం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. బాబాకు సత్యవ్రతాలు, శాంతి హోమ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కల జింకకు గాయాలు



గాయపడిన జింక

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్లలోని సాంకేతిక శిక్షణ కేంద్రంలోని చుక్కల జింకపై సోమవారం కుక్కలు దాడి చేసి గాయపర్చాయి. కుక్కల దాడిని గమనించిన టీటీడీసీ సెక్యూరిటీ సిబ్బంది అడ్డుకున్నారు. అనంతరం స్థానిక పశువైద్యాధికారి వాల్లే రమణకు సమాచారం ఇవ్వగా ఆయన వచ్చి చికిత్స చేశారు. అనంతరం శ్రీకాకుళంలోని ప్రధాన ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు.


ఘన జీవామృతంతో భూసారం



జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: ఘన జీవామృతంతో భూసారం పెరుగుతోందని ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు సిబ్బంది ధనలక్ష్మి, అప్పలనర్సయ్య అన్నారు. ముద్దాడ గ్రామంలో ఘన జీవామృతం తయారీ, ప్రయోజనాలపై రైతులకు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ఖర్చు లేకుండా విరివిగా లభించే పేడ, ఆవు మూత్రం ఆధారంగా జీవామృతాన్ని తయారు చేయవచ్చునన్నారు.

చోడి పంట పరిశీలన



చోడి చేనును పరిశీలిస్తున్న అధికారులు

జి.సిగడాం: మానంపేట, మద్రివలస, పెంట గ్రామాల్లో రైతులు సాగు చేసిన చోడి(రాగి) పంటను జిల్లా వ్యవసాయశాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. నీరు ఉన్న ప్రాంతల్లో ఎక్కువగా ఈ పంటను సాగు చేస్తున్నారు. పరిశీలనలో ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ కె.కృష్ణారావు, రణస్థలం ఏడీఏ శ్రీనివాసరావు, ఏవోలు యర్ర శారద, బత్తిన ఇందుమతి, వై.సూర్యకుమారి, గ్రామసర్పంచ్ విక్రం కోటిబాబు, మానం సత్యారావు, ఏఈఓలు కంబాల జగదీశ్వరరావు, కొమ్ము అప్పారావు ఉన్నారు.

నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలి

రణస్థలం:

స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి బి.దుర్గారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పిన్నింటి సాయికుమార్ అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నేతాజీ 126వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ధనుంజయరావు, ఎంఈవో అల్లాడ త్రినాథరావు, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, నాయకులు మహంతి పెదరామినాయుడు, రెడ్డి రాము, కిల్లారి సూర్యనారాయణ, కెల్ల రామకృష్ణ, గురాన ప్రసాద్ ఉన్నారు.

స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర

లావేరు: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో సుభాష్ చంద్రబోస్ కీలకపాత్ర పోషించారని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఏఎంసీ మాజీ డైరెక్టర్ లుకలాపు అప్పలనాయుడు, లావేరు శాఖాగ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, అదపాక హైస్కూల్ హెచ్ఎం వి.సత్యనారాయణ అన్నారు. లింగాలవలసలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం, లావేరు గ్రంథాలయం, అదపాక హైస్కూల్‌లో నేతాజీ జయంతి వేడుకలు జరిగాయి. చంద్రబోస్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమంలో ధైర్యానికి, సాహసానికి నేతాజీ మారుపేరుగా నిలిచారన్నారు. ఆంగ్లేయులు బోస్‌ను 11 సార్లు జైలులో నిర్బంధించారని గుర్తు చేశారు. ఆయన ఆశయాలను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంటి గిరిధర్, నాయకులు లుకలాపు లక్ష్మణరావు, మీసాల నారాయణరావు, తరిగొప్పుల శ్రీనివాసరావు, గొర్లె సూర్యనారాయణ, చందక నాగరాజు, పతివాడ గురునాయుడు, అలబోయిన రాములు, గ్రంథాలయ సహాయకుడు ఎ.గడ్డెయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్: గాంధీమందిరంలో సుభాష్‌చంద్రబోస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం



రణస్థలం: సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, నాయకులు



శ్రీకాకుళం అర్బన్: గ్రంథాయలంలో నేతాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

బ్రిటీష్ సైన్యాన్ని వణికించారు

శ్రీకాకుళం అర్బన్: దేశ స్వాతంత్ర్యం కోసం బ్రిటీష్ సైన్యాన్ని వణికించిన నేత నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని బలగ శాఖా గ్రంథాలయ అధికారి పి.ఉగ్రసేన అన్నారు. గ్రంథాలయంలో చంద్రబోస్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రిటీష్ సైన్యాన్ని ముప్పతిప్పలు పెట్టి శత్రువులను చెమటలు పట్టించిన మహానేత, స్వాతంత్ర్య సమరయోధుడు చంద్రబోస్ అని కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకరాలు కె.అనిత, పాఠకులు పాల్గొన్నారు.

గాంధీ మందిరంలో..

శ్రీకాకుళం అర్బన్: భారతదేశానికి స్వాతంత్ర్యం కోసం అసమాన పోరాటం, తెగువ ప్రదర్శించిన నేత సుభాష్ చంద్రబోస్ అని హౌసింగ్ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ నక్క గణపతి అన్నారు. స్థానిక గాంధీస్మారక నిధితో ఏర్పాటు చేసుకున్న గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతి వనంలో నేతాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. విగ్రహదాత నక్క శంకరరావుతో పాటు పీడీ నక్క గణపతి, గాంధీ మందిర కమిటీ ప్రతినిధులు నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గణపతిరావు మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాటం కీలక దశలో సాయుధ మార్గాన్ని అనుసరించాలని నేతాజీ ఇచ్చిన పిలుపు ఉద్యమకారులకు ఉత్తేజాన్ని ఇచ్చిందన్నారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి నారాయణరావు, గాంధీ మందిర నిర్వాహకులు సురంగి మోహన్ రావు, బరాటం లక్ష్మణరావు, నటుకుల మోహన్, పందిరి అప్పారావు, వావిలపల్లి జగన్నాథంనాయుడు, మెట్ట అనంతం భట్లు, పొన్నాడ రవికుమార్, గుత్తు చిన్నారావు ఉన్నారు.



లావేరు: లింగాలవలసలో సుభాష్‌చంద్ర బోస్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న అప్పలనాయుడు

గరిష్ట వేతనం వచ్చేలా పనిచేయాలి

● డ్వామా పీడీ చిట్టిరాజు



పనులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ చిట్టిరాజు

ఎచ్చెర్ల క్యాంపస్: గరిష్ట వేతనం వచ్చేలా ప్రణాళికాబద్ధంగా ఉపాధి హామీ పథకం వేతనదారులు పనులు చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ చిట్టిరాజు సూచించారు. పొన్నాడ పంచాయతీ కమ్మువానిపేటలో జరుగుతున్న ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. వేతనదారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. రోజుకు ఎనిమిది గంటలు పనిచేస్తే గరిష్ట వేతనం గిట్టుబాటు అవుతోందన్నారు. ఉదయం, మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పనిచేస్తే రోజుకు 257 రూపాయల గరిష్ట వేతనానికి అవకాశం ఉంటుందని వివరించారు. సాంకేతిక సహాయకుల సూచనలు పాటించాలన్నారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి పనులను గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధి పనులతో గ్రామాల ప్రగతి, వలసలు నియంత్రణ సాధ్యమవుతాయన్నారు. చెరువులు, పంట కాలువలు, రోడ్ల మరమ్మతులు, జలవనరులు మెరుగు పనులను ఉపాధి హామీ పథకం ద్వారా చేసుకోవచ్చునన్నారు. భూగర్భ జలాల మెరుగుకు కృషి చేయాలన్నారు. జాబ్‌కార్డు ఉన్న వేతనదారులు వంద పని దినాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీవో వెంట ఏపీవో శోభారాణి, ఈసీ నారాయణమ్మ, టెక్నికల్ అసిస్టెంట్లు నాయుడు, రమణ ఉన్నారు.

ఇంటర్న్‌షిప్‌పై అధ్యాపకులకు అవగాహన



మాట్లాడుతున్న సత్యనారాయణ

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ చేసే విధానంపై అధ్యాపకులకు అవగాహన కల్పిస్తామని శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.వి.సత్యనారాయణ అన్నారు. మూడు రోజుల ట్రైనింగ్ ఆఫ్ ట్రైనర్స్ రెండో విడత కార్యక్రమం సోమవారం కళాశాలలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్యుమెంటేషన్ చేయడంపై అవగాహన, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లోని ఆధునిక పోకడల గురించి శిక్షణలో వివరిస్తామన్నారు. జిల్లాలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న 44 మంది అధ్యాపక సిబ్బంది శిక్షణలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా నోడల్ రిసోర్స్ సెంటర్ కో ఆర్డినేటర్ డాక్టర్ వై.పోలినాయుడు, జిల్లా నోడల్ ఇంటర్న్‌షిప్ కోఆర్డినేటర్ బి.మోహనరావు, కార్యక్రమ కోఆర్డినేటర్ హనుమంతు లక్ష్మీపతి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ శాంతిదేవి, మాస్టర్ ట్రైనర్లు లబ్బ కృష్ణారావు, ఎన్ని పవన్ కుమార్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో విద్యార్థులకు మేలు



పెయింటింగ్ పోటీలు పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

శ్రీకాకుళం రూరల్: విద్యార్థుల్లో భయాందోళనలు పోగట్టడమే పోటీ పరీక్షల లక్ష్యమని కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ కె.శంకరయ్య అన్నారు. అందులో భాగంగా పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పది విద్యాసంస్థల నుంచి వంద మంది విద్యార్థులకు కేంద్రీయ విద్యాలయంలో సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ప్రధాన నరేంద్రమోదీ రాసిన పుస్తకాల్లో ఉన్న లక్ష్యం మేరకు పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మదినం సందర్భంగా పరాక్రమ దివాస్‌గా దీనికి నామకరణం చేసినట్లు వెల్లడించారు. విజేతలకు ప్రధానమంత్రి రాసిన పుస్తకాలను అందజేశారు. అలాగే త్వరలో జరగనున్న జేఈఈ మెయిన్స్ పరీక్షలపై సిటీ కోఆర్డినేటర్ శంకరయ్య విద్యార్థులకు సలహాలిచ్చారు. కార్యక్రమంలో వెన్నెలవలస నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని చిన్నబజారు వీధిలో ఉన్న వాసవి కన్యకా పరమేశ్వరీదేవి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆరవెల్లి చంద్రశేఖరశర్మ, ఆరవెల్లి వెంకటరమణశర్మల ఆధ్వర్యంలో అమ్మవారికి క్షీరాభిషేకాలు, పండ్ల రసాలతో అభిషేకాలు, కుంకుమ పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వాసవీ క్లబ్ సభ్యులు తమ్మన వల్లభ, మాడిపాక సుదా, పెర్ల సురేష్, మామిడిపాక వెంకటరావు, మరియు అరసవల్లి ట్రస్టు బోర్డు సభ్యులు మండవిల్లి రవి, భక్తులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించండి

● టెక్కలి సబ్‌కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి



వినతులు స్వీకరిస్తున్న టెక్కలి సబ్‌కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

మెళియాపుట్టి: ప్రజల అందజేసిన ఫిర్యాదులు, అర్జీలు పరిష్కరించే దిశగా డివిజన్, మండల స్థాయి అధికారులు పనిచేయాలని టెక్కలి సబ్‌కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని నేలబొంతు గ్రామంలో డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. రహదారులు, తాగునీరు, పెన్షన్లు, పోడు పట్టాలు తదితర సమస్యలపై ఆయన వినతులను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రతీ ఇంటింటికీ వెళుతూ సమస్యలను తెలుసుకుంటున్నారని, అధికారులు సైతం అదేబాటలో ఆలోచనచేసి వినతులు స్వీకరించి, శాఖలవారీగా వాటికి తగిన పరిష్కారం చూపాలన్నారు. ప్రజలవద్దకు అధికారులు వెళ్లడం ద్వారా వారికి సహకరించిన వారవుతామన్నారు. ప్రతీ సోమవారం గిరిజన గ్రామాల్లోనే స్పందన నిర్వహిస్తూ ప్రజలకు దగ్గరగా వెళ్లి వారి సమస్యలపై వినతులు స్వీకరిస్తామని తెలియజేశారు. నిర్ణీత కాల వ్యవధిలో వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. డివిజన్ కేంద్రానికి ప్రజలు రాలేక వారి సమస్యలను చెప్పుకోలేని సమయంలో.. అధికారులే వారికి అందుబాటులో ఇటువంటి వేదికలను ఏర్పాటు చేసి ప్రతీ సమస్యపై అర్జీలు స్వీకరించాలనేది ముఖ్యమంత్రి ఉద్దేశమన్నారు. డీఎల్‌డీఓ అలివేలు మంగమ్మ, ఏడీ మధుబాబు, సీఐ వినోద్‌బాబు, డీఎంహెచ్‌ఓ లక్ష్మీతులసి, తహసీల్దార్ పి.సరోజిని, ఎంపీడీఓ చంద్రకుమారి, జెడ్పీటీసీ గూడ ఎండయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు బైపోతు ఉదయ్‌కుమార్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సబ్ ప్లాన్ పొడిగింపుపై హర్షం



మాట్లాడుతున్న ఎస్సీ సెల్ విభాగం ప్రతినిధులు

నరసన్నపేట: రాష్ట్రంలో ఉన్న ఎస్సీ, ఎస్టీలకు మరో పదేళ్ల ప్రయోజనం కల్పించేందుకు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ పొడిగిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆర్డినెన్స్ తీసుకురావడం పట్ల ఎస్సీ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఎస్సీల అభివృద్ధికి మరో పదేళ్లు నిధులు రానున్నాయన్నారు. ఈ నిర్ణయం ఎస్సీ, ఎస్టీలకు వరమని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి కోటిపల్లి శ్రీను, నరసన్నపేట నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ సతివాడ రామినాయుడు, పోలాకి, నరసన్నపేట మండలాల ఎస్సీ సెల్ కన్వీనర్లు లక్ష్మణరావు, మచ్చ గణేష్ అన్నారు. ముఖ్యమంత్రికి ఎస్సీ, ఎస్టీలు రుణ పడి ఉంటారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎస్సీలు అన్ని విధాలా అభివృద్ధికి నోచుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వం మా అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. సీఎం జగన్ బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎస్సీలు, ఎస్టీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి అనేక కార్యక్రమాలు చేపట్టారన్నారు. సీఎం జగన్‌కు తామంతా అండగా ఉంటామన్నారు.

పదివేల ఎకరాల్లో చిరుధాన్యాల సాగు



మాట్లాడుతున్న కృష్ణారావు

జి.సిగడాం: జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది పది వేల ఎకరాల్లో చిరుధాన్యాల సాగు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ కె.కృష్ణారావు తెలిపారు. మద్రివలస గ్రామంలో సోమవారం చిరు ధాన్యాల పంటల సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023 –24 ఆర్థిక సంవత్సరంలో రెండు వందల క్లస్టర్లలో 50 ఎకరాల చొప్పున పది వేల ఎకరాల్లో చిరు ధాన్యాల సాగు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. రైతులకు 50 శాతం రాయితీపై చిరుధాన్యాల విత్తనాలు, పనిముట్లను ప్రభుత్వం సరఫరా చేస్తోందన్నారు. ఆధునిక పద్ధతులతో పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధ్యమన్నారు. ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ సభ్యుడు కాయల రమణ మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. కార్యక్రమంలో రణస్థలం ఏడీఏ శ్రీనివాసరావు, ఏవోలు యర్ర శారద, బత్తిన ఇందుమతి, సూర్యకుమారి, సర్పంచులు విక్రం కోటిబాబు, మానం సత్యారావు, ఏఈఓలు కంబాల జగదీశ్వరరావు, కె.అప్పారావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ ఎస్.హరికృష్ణ, హేమంత్, లక్ష్మీనారాయణ, సత్యన్నారాయణ ఉన్నారు.

'శరణు శరణు' పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: బైటారు మాధవి రచించిన 'శరణు శరణు' ఆధ్యాత్మిక పుస్తకాన్ని స్థానిక మహిళా కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ పి.శ్రీరాములు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రచయిత ఆధ్యాత్మికంగా కొత్త ఒరవడిలో పుస్తకాన్ని, దేవుళ్ల, పూజావిధానం కోసం చక్కగా వర్ణించారని కితాబిచ్చారు. రచయిత బైటారు మాధవిని సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, ఉమాకవి, సురంగి మోహనరావు, తెరవే అధ్యక్ష, కార్యదర్శిలు యు.నాగేశ్వరరావు, ఆర్.వి.రమణమూర్తి, ఇంటాక్ పూర్వ కన్వీనర్ కె.వి.జె.రాధాప్రసాద్, నిక్కు అప్పన్న, హరిసత్యన్నారాయణ, రెడ్డి లలిత, ఎం.శ్రీనివాసరావు, పి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



లావేరు: తాళ్లవలస సచివాలయంలో పిల్లలకు ఆధార్ సేవలు అందిస్తున్న సిబ్బంది



జి.సిగడాం: వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

లావేరు: సచివాలయాల్లో ఏర్పాటు చేస్తున్న ఆధార్ క్యాంపుల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కె.సురేష్‌కుమార్ అన్నారు. తాళ్లవలస, గురుగుబిల్లి, బెజ్జిపురం, అదపాక, కొత్తకుంకాం సచివాలయాల్లో సోమవారం ఆధార్ క్యాంపులను నిర్వహించగా.. వీటిని ఎంపీడీవో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక శిబిరాల్లో ఆధార్ ఎన్‌రోల్‌మెంటు, అప్‌డేషన్, ఫోన్ నంబర్ లింకు, వేలిముద్రలు అప్‌డేషన్, ఫొటో మార్పు చేసి అప్‌డేట్ చేయడం వంటి సేవలు అందిస్తున్నట్టు పేర్కొన్నారు. గ్రామ స్థాయిలోనే ఆధార్ సేవలు అందాలన్న లక్ష్యంతో ప్రభుత్వం సచివాలయాల్లో మొబైల్ క్యాంపులను నిర్వహిస్తోందని ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, ఎం.రమణ, కేవీ ప్రసాద్, బి.శ్రీనివాసరావు, కె. రామకృష్ణ, సుజాత, సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు కె.పద్మ, డి.రేవంత్‌కుమార్, పి.లక్ష్మీకాంత్, జె.రామకృష్ణ, టి.గౌరీశంకర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయంలో..

జి.సిగడాం: ఆధార్ సేవలను వినియోగించుకోవాలని జి.సిగడాం గ్రామ సర్పంచ్ ముద్దాడ ఈశ్వరమ్మ కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. పంచాయితీ కార్యదర్శి సాహు, డిజిటల్ అసిస్టెంట్ పాగిరి రాము, వైఎస్సార్‌సీపీ నాయకుడు ముద్దాడ గౌరీ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో చక్రతీర్థ స్నానాలు

సారవకోట: మండలంలోని తొగిరి అభయాంజనేయ స్వామి వారి చక్రతీర్థ స్నానాలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులపాటు నిర్వహించిన ఆలయ వార్షికోత్సవం అనంతరం నాల్గో రోజు స్వామి వారి చక్రతీర్థ స్నానాలను స్థానిక కోనేరులో చేపట్టారు. ఆలయంలో విశేష, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రెడ్‌క్రాస్ విభాగం ఏర్పాటు

పోలాకి: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ (శ్రీకాకుళం జిల్లా శాఖ) ఆధ్వర్యంలో ఈదులవలస ఏపీ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో రెడ్‌క్రాస్ విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ పి.ప్రవీణ సోమవారం తెలిపారు. ఈ విభాగం ద్వారా విద్యార్థులకు సమాజసేవలో భాగస్వామ్యం చేసి రక్తదానం, నేత్రదానం, పరిసరాల పరిశుభ్రత వంటి వాటిపై అవగాహన కల్పిస్తామన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు చైతన్యపరిచే కార్యక్రమంలో వీరు చురుగ్గా పాల్గొంటారని చెప్పారు. రెడ్‌క్రాస్ విభాగం ఏర్పాటు కార్యక్రమంలో కో–ఆర్డినేటర్ సత్యనారాయణ, పీడీ నీలం ఉన్నారు.

హెచ్ఎం పేరుతో రూ.15 వేల టోకరా

కొత్తూరు: మండలంలోని జోగిపాడులో హెచ్ఎం పేరు చెప్పి అదే గ్రామానికి చెందిన కరణం రమణ వద్ద నుంచి రూ.15వేలను గుర్తుతెలియని వ్యక్తి టోకరా వేశాడు. ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మోటారు సైకిల్‌పై జోగిపాడు వచ్చాడు. హెచ్ఎం డబ్బులు ఇమ్మని తనను పంపించారని రమణను అడిగాడు. రమణ ఆ మొత్తం ఇవ్వడంతో అక్కడి నుంచి ఉడాయించాడు. సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన హెచ్ఎం ఎస్.ప్రసాద్‌తో మాట్లాడిన రమణ అసలు విషయం తెలుసుకుని లబోదిబో అన్నాడు. డబ్బులు ఇచ్చిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఫొటోను రమణ తీశారు. సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

క్వారీల పరిశీలన

బూర్జ: మండలంలోని వైకుంఠపురం పంచాయతీ అల్లెపల్లి గ్రామం సమీపంలో ఉన్న చింతల కొండ, లక్ష్మీపురం కొండలను (క్వారీలను) పోలీస్, రెవెన్యూ సిబ్బంది సోమవారం పరిశీలించారు. గ్రామస్తులు ఇటీవల ఫిర్యాదు చేశారు. స్టోన్ క్రషర్ నిమిత్తం రాళ్లు నిత్యం వాహనాలతో తరలిస్తున్నారని, రాళ్లు రిగ్గులతో డ్రిల్లింగ్ చేయడంతో గ్రామంలోకి వచ్చి పడుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ఐ బి.అశోక్‌బాబు, డీటీ సంతోష్ కుమార్, ఆర్ఐ, వీఆర్వో పాల్గొన్నారు.

పీఏసీఎస్ రుణాలు రెన్యువల్ చేసుకోవాలి

ఎల్.ఎన్.పేట: లక్ష్మీనర్సుపేట గ్రామంలోని పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం) ద్వారా ఖరీఫ్, రబీ 2022–23 పంట కాలానికి తీసుకున్న రుణాలను రెన్యువల్ చేసుకోవాలని పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల కృష్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిబ్రవరి 20వ తేదీలోగా రుణాలు రెన్యువల్ చేసుకున్నావారు 4 శాతం వడ్డీ చెల్లిస్తే సరిపోతుందన్నారు. సకాలంలో చెల్లించకపోతే వడ్డీ రాయితీని కోల్పోవాల్సి ఉంటుందన్నారు. గడువు దాటితే 13 శాతం వడ్డీ చెల్లించాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే వడ్డీ రాయితీలు, ఇతర సౌకర్యాలను పొందలేరన్నారు. తమ సిబ్బంది ద్వారా, నేరుగా కార్యాలయానికి వచ్చి రుణాలు రెన్యువల్ చేసుకోవచ్చన్నారు.